# నమస్తే తెలంగాణ
# కరీంనగర్

5 | కరీంనగర్, శనివారం 29 మార్చి 2025 | KARIMNAGAR


## కౌలు రైతు కంటతడి

మడులు తడవక పశువుల మేతకు వరి



నీళ్లులేక ఎండిపోయిన పొలంలో బర్లను మేపుతున్న రైతు చంద్రు

రాజన్న సిరిసిల్ల, మార్చి 28 (నమస్తే తెలంగాణ) : తలాపునే మానేరు నది ఉన్నా మడులు తడవక వరి పొలాలు పశువులకు మేతగా మారుతున్నాయి. అందుకు నిదర్శనమే ఈ చిత్రం.. గంభీరావుపేట మండలం జగదాంబతండాకు చెందిన కౌలు రైతు బానోతు చంద్రు వ్యవసాయ బావి ఉందని ₹12 వేలకు ఎకరం పొలం కౌలుకు తీసుకుని వరి వేశాడు. సాగు కోసం మరో ₹30 వేల వరకు ఖర్చు చేశాడు. తీరా పొట్టదశకు వచ్చాక బావిలో నీళ్లు అడుగంటడంతో వరి మొత్తం ఎండిపోయింది. దీంతో చేసేదేమి లేక ఇలా పశువుల మేతకు వదిలేశానని కన్నీటి పర్యంతమవుతున్నాడు. ప్రభుత్వం ఇస్తానన్న కౌలు భరోసా రాలేదని, పెట్టుబడి, కౌలు మీద పడిందని ఆవేదన చెందుతున్నాడు. ఈ పరిస్థితి ఒక్క చంద్రుదే కాదు, సిరిసిల్ల జిల్లాల్లోని అనేక మండలాల్లో చాలా మంది రైతులది. జిల్లాలో 500 ఎకరాల వరకు వరి ఎండిపోయిందని అధికారులు చెబుతుండగా, ఇంకా ఎక్కువే ఉంటుదని రైతులు వాపోతున్నారు. గతేడాది వరకు రెండు, మూడు వందల ఫీట్లకు బోరు వేస్తే నీళ్లు వచ్చేవని, ఈసారి వెయ్యి ఫీట్లు వేసినా చుక్క నీళ్లు రాక అప్పుల పాలవుతున్నామంటూ ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

## గడువులోగా జీఎస్టీ చెల్లించాలి

- సెంట్రల్ జీఎస్‌టీ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్

సిరిసిల్ల కలెక్టరేట్, మార్చి 28 : పన్ను చెల్లింపుదారులు జీఎస్టీని గడువులోగా చెల్లించాలని సెంట్రల్ జీఎస్టీ చీఫ్ కమిషనర్ సందీప్ ప్రకాశ్ సూచించారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. జీఎస్టీ అమలులోకి వచ్చిన తొలి మూడేళ్లలో పన్ను చెల్లింపుదారులు ఎదుర్కొన్న వివిధ సాంకేతిక సమస్యల వల్ల పన్ను చెల్లింపులలో వ్యత్యాసాలు ఏర్పడినట్లు తెలిపారు. వీటిపై జీఎస్టీ అధికారులు పన్ను మదింపు చేసి పన్ను, జరిమానా, వడ్డీ చెల్లించాల్సిందిగా ఉత్తర్వులు జారీ చేసినట్లు చెప్పారు. అయితే, సదరు పన్ను చెల్లింపుదారుల నుంచి వచ్చిన విజ్ఞప్తులను పరిగణించి సదరు పన్నును చెల్లిస్తే జరిమానా, వడ్డీని మాఫీ చేయడానికి ప్రభుత్వం ఒక పథకం ప్రవేశపెట్టిందని, దీని ప్రకారం 2017-18, 2018-19, 2019-20 సంవత్సరాలకు మ దింపు చేసిన పన్ను మొత్తాన్ని చెల్లిస్తే దానిపై వేసిన జరిమానా (పెనాల్టీ), వడ్డీ మాఫీ చేయనున్నట్లు వెల్లడించారు. అప్పీలేట్ అథారిటీ లేదా కోర్టులో చాలెంజ్ చేసిన మదింపు ఉత్తర్వులకు కూడా ఈ పథకం వర్తిస్తుందని, అయితే, సదరు మదింపు చేసిన పన్ను ఈ నెల 31వ తేదీలోపు చెల్లించిన వారికి మాత్రమే వర్తిస్తుందని తెలిపారు. పన్ను చెల్లింపుదారులు ఈ నెల 31లోపు పన్ను చెల్లించి, 30 జూన్ 2025లోగా జీఎస్టీ పోర్టల్ ద్వారా సదరు దరఖాస్తును సమర్పిస్తే ఈ పథకానికి అర్హులు అవుతారని సూచించారు.

## బ్యాంకు ముందే రూ.1.50 లక్షలు చోరీ

- బైక్ కవర్ నుంచి ఎత్తుకెళ్లిన దుండగులు

కోరుట్ల, మార్చి 28: మీ డబ్బులు పడిపోయాయని దృష్టిని మరల్చిన దుండగులు, బ్యాంకు ముందే సినీఫక్కీలో చోరీకి పాల్పడ్డారు. బైక్ కవర్ నుంచి ₹1.50 లక్షలు ఎత్తుకెళ్లారు. కోరుట్ల ఎస్ఐ శ్రీకాంత్ తెలిపిన వివరాల ప్రకారం.. అయిలాపూర్‌కు చెందిన చింతకింది శ్రీహరి, తన మిత్రుడితో కలిసి శుక్రవారం కోరుట్లలోని ఎస్‌బీఐ బ్యాంకులో ₹1.50 లక్షల నగదు విత్‌డ్రా చేసుకుని బయటకు వచ్చాడు. ఆ డబ్బులను తన బైక్ కవర్‌లో ఉంచాడు. ఇదంతా గమనిస్తున్న ఓ నలుగురు దుండగులు ఆ నగదును కాజేసేందుకు పన్నాగం పన్నారు. శ్రీహరి తన బైక్‌ను తీసుకొని వెళ్లే క్రమంలో ఓ వ్యక్తి అతడి వద్దకు వచ్చి.. పక్కనున్న బైక్ వద్ద మీ నగదు కింద పడిపోయాయని దృష్టి మరల్చాడు. దాంతో శ్రీహరి బైక్ దిగి అక్కడకు వెళ్లి డబ్బులు తీసుకునే సమయంలో.. అక్కడే మరో బైక్‌పై ఉన్న దుండగుడు శ్రీహరి బైక్ కవర్‌లో ఉన్న డబ్బులను తీసుకొని పారిపోయాడు. డబ్బులు పడిపోయాయని చెప్పిన వ్యక్తి కూడా అక్కడి నుంచి జారుకున్నాడు. తర్వాత శ్రీహరి తన బైక్ వద్దకు వచ్చి చూడగా కవర్‌లోని డబ్బులు కనిపించకపోవడంతో లబోదిబోమన్నాడు. వెంటనే పోలీసులకు ఫిర్యాదు చేయగా, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనాస్థలిలో సీసీకెమెరా ఫుటేజీని పరిశీలించారు. నిందితుల కదలికలు, అనుమానితుల ఫొటోలను విడుదల చేశారు. నిందితులు కనిపిస్తే తన సెల్ నంబర్‌కు (8712656790) కాల్ చేయాలని ఎస్ఐ సూచించారు.

# కేటీఆర్ చొరవ.. ఉపాధికి భరోసా

నాలుగేళ్ల కిందట సిరిసిల్లలో అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ కేంద్రం ఏర్పాటు

ఇప్పటికే 5వేల మందికి డ్రైవింగ్‌లో ట్రైనింగ్

- అంతర్జాతీయ ప్రమాణాలతో తర్ఫీదు
- వందలాది మందికి ఉద్యోగాలు



**ప్రభుత్వ రంగ సంస్థ సిరిసిల్లలోని టీఐడీఈఎస్ నిరుద్యోగులకు బాసటగా నిలుస్తున్నది. మోటర్ ఫీల్డ్‌పై ఆసక్తి ఉన్న వారికి అత్యాధునిక ప్రమాణాలతో నయా డ్రైవింగ్ ట్రైనింగ్ అందిస్తున్నది. రాష్ట్రంలోనే తొలి అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ సంస్థగా పేరొందిన సెంటర్, అప్పటి మంత్రి, ప్రస్తుత ఎమ్మెల్యే కేటీఆర్ చొరవతో తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో 20 ఎకరాల్లో ₹21.69 కోట్లతో నాలుగేండ్ల కింద ఏర్పాటైంది. ఇప్పటి వరకు 5 వేల మందికిపైనే తర్ఫీదునిచ్చింది. అందులో వందలాది మందికి డ్రైవర్ ఉద్యోగాలు సైతం లభించగా, ఈ కేంద్రానికి రోజురోజుకూ ఆదరణ పెరుగుతున్నది.**



తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో మాజీ మంత్రి కేటీఆర్ హయాంలో ప్రారంభించిన టీఐడీఈఎస్ ట్రాకింగ్ వ్యూ

రాజన్న సిరిసిల్ల, మార్చి 28(నమస్తే తెలంగాణ) : దేశంలో రోజురోజుకూ రోడ్డు ప్రమాదాలు పెరిగి ప్రజల ప్రాణాలు గాల్లో కలుస్తున్నాయి. అచ్చీరాని డ్రైవింగ్, నిబంధనలు తెలియకపోవడం యాక్సిడెంట్లకు కారణం అవుతుండగా, ప్రమాదాల నివారణ కోసం డ్రైవర్లకు అంతర్జాతీయ ప్రమాణాలతో నైపుణ్య శిక్షణ ఇచ్చేందుకు ప్రభుత్వ రంగ సంస్థగా తెలంగాణ ఇనిస్టిట్యూట్ ఆఫ్ డ్రైవింగ్ ఎడ్యుకేషన్ స్కిల్స్ (టీఐడీఈఎస్)ను సిరిసిల్లలో అప్పటి మంత్రి కేటీఆర్ బీఆర్ఎస్ హయాంలో ఏర్పాటు చేశారు. తంగళ్లపల్లి మండలం మండెపల్లిలో 20 ఎకరాల్లో ₹21.69 కోట్లతో 2021లోనే ప్రారంభించి, అందుబాటులోకి తెచ్చారు. ఇది రాష్ట్రంలోనే తొలి అంతర్జాతీయ డ్రైవింగ్ శిక్షణ సంస్థ. తెలంగాణకే తలమానికంగా పేరు తెచ్చుకున్నది. రోడ్డు భద్రత, ప్రమాదాల నివారణకు అశోక్ లేలాండ్ సంస్థ సహకారంతో నిష్ణాతులైన శిక్షకులతో యువతకు 30 రోజులపాటు ట్రైనింగ్ ఇస్తున్నది. అంతేకాదు, సంస్థనే డ్రైవింగ్ ట్రైనింగ్ సర్టిఫికెట్ కూడా అందిస్తున్నది. ఇందులో ఇప్పటి వరకు వివిధ రాష్ట్రాలకు చెందిన 5 వేల మంది లైట్ మోటర్, హెవీమోటర్ వెహికల్ డ్రైవింగ్‌లో నైపుణ్య శిక్షణ పొందారు.



..ఈ చిత్రంలో కనిపిస్తున్న యువతి పేరు సోనాలి (20). మహారాష్ట్రలోని గడ్చిరోలీ తాలూక బండె గ్రామం. ఏడో తరగతి దాకా చదువుకున్నది. తల్లిదండ్రులు ఆ గ్రామంలోనే క్రషర్ మిషన్‌లో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆమెకు ఒక అక్క, ముగ్గురు అన్నలు. సోనాలీ రెండో కూతురు. అదే గ్రామంలోని రెడీమేడ్ గార్మెంట్ కంపెనీలో పనిచేస్తున్నది. ఈ క్రమంలో ఆ తాలూకాకు చెందిన 32 మంది యువతకు మోటర్ వాహనంలో శిక్షణ ఇప్పించేందుకు త్రివేణి ఎర్త్‌మూవర్స్ అనే కంపెనీ స్పాన్సర్ చేసింది. గతేడాది డిసెంబర్ 11న జిల్లాలోని టీఐడీఈఎస్‌లో చేరింది. 30 రోజులు లైట్ మోటర్ వాహనంలో శిక్షణ పొందింది. తిరిగి అదే గార్మెంట్ కంపెనీలో దుస్తులను సరఫరా చేసేందుకు నెలకు ₹8 వేల వేతనంతో టాటా ఏసీ డ్రైవర్‌గా చేరింది. సోనాలి ఒక్కరేకాదు, ఇప్పటివరకు తెలంగాణతోపాటు వివిధ రాష్ట్రాల్లోని చాలా మంది యువతీ యువకులు శిక్షణ పొంది ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీలో డ్రైవర్లుగా ఉద్యోగాలు సంపాదించి మంచి వేతనం పొందుతున్నారు.





లైట్ మోటర్ వెహికల్ సిమ్యులేటర్‌పై యువతకు నైపుణ్య శిక్షణ ఇస్తున్న శిక్షకులు



ఐడీఆర్‌లో శిక్షణ కోసం కేటాయించిన వాహనాలు

### ఆర్టీసీలో ఉద్యోగావకాశాలు

ఈ సెంటర్‌లో సెక్రటరీ, ప్రిన్సిపల్ దురై మురుగన్ ఆధ్వర్యంలో మోటర్ వాహనాల తయారీ కంపెనీల్లో ప్రొఫెసర్లతో యువతకు శిక్షణ ఇచ్చి సుశిక్షితులైన డ్రైవర్లుగా తీర్చిదిద్దుతున్నారు. వాహనాల డ్రైవింగ్, రోడ్లు, పాఠశాలలు, జంక్షన్లు, ట్రాఫిక్ రూల్స్‌పై పూర్తిస్థాయిలో అవగాహన కల్పించిన తర్వాత వాహనాలు నడిపించే శిక్షణ ఇస్తారు. ఇక్కడ ట్రైనింగ్ తీసుకున్న వారిలో 300 మంది సీఆర్‌పీఎఫ్, పోలీస్, బీఎస్ఎఫ్, ప్రైవేట్ కంపెనీల్లో డ్రైవర్ ఉద్యోగాలు కూడా పొందారు. బయట డ్రైవింగ్ స్కూళ్లు అనేకం ఉన్నప్పటికీ ఇందులో శిక్షణ పొందిన వారికే అన్ని సంస్థలు తొలి ప్రాధాన్యత ఇస్తుండడంతో నిరుద్యోగ యువతీ యువకులు ఆసక్తి చూపుతున్నారు. ప్రస్తుతం రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీలో మూడు వేల డ్రైవర్ పోస్టులు భర్తీ చేస్తున్నందున చాలా మంది శిక్షణ పొందేందుకు దరఖాస్తు చేసుకుంటున్నారు. అభ్యర్థులకు హాస్టల్‌తో కలిపి నెలకు ₹15 వేల ఫీజు వసూలు చేస్తున్నది. వివిధ ప్రాంతాల నుంచే యువతకు వసతి, భోజనం ఉంటుంది. భవిష్యత్తులో ఉచితంగా డ్రైవింగ్ శిక్షణ ఇచ్చేందుకు ఏర్పాట్లు చేస్తున్నట్లు అధికారులు తెలిపారు.

### రామన్నకు కృతజ్ఞతలు



నేను డిగ్రీ చదువుకున్నా. ఉద్యోగం లేదు. డ్రైవింగ్ అంటే నాకెంతో ఇష్టం. ఆర్టీసీలో డ్రైవర్ పోస్టుల భర్తీకి నోటిఫికేషన్ వేస్తున్నట్లు వార్తలు చూశా. డ్రైవింగ్ నేర్చుకోవాలనుకుని ఓ ప్రైవేట్ కంపెనీలో చేరాలనుకున్నా. సిరిసిల్లలో ఏర్పాటు చేసిన అంతర్జాతీయ డ్రైవింగ్ స్కూల్‌లో చేరితో తప్పకుండా ఉద్యోగం వస్తుందని మా ఫ్రెండ్స్ చెప్పారు. వెంటనే ఇక్కడికొచ్చి చేరా. చాలా బాగుంది. డ్రైవింగ్ ఒక్కటే కాదు, అన్ని రకాల మెలకువలు నేర్పుతున్నారు. ఇంత మంచి సెంటర్‌ను ఏర్పాటు చేసిన రామన్నకు కృతజ్ఞతలు.

**- ఎర్రోల్ల శ్రీకాంత్, గజ్వేల్ (సిద్దిపేట జిల్లా)**

### కేటీఆర్‌కు రుణపడి ఉంటాం



నేను డిగ్రీ పూర్తి చేశా. ఖాళీగా ఉంటున్నా. హెవీ మోటర్ వెహికల్ డ్రైవింగ్ నేర్చుకోవాలంటే ఎక్కడా అవకాశం లేదు. ఏదైనా లారీపై క్లీనర్‌గా పనిచేస్తే తప్ప నీకు నేర్పరంటూ చెప్పారు. ప్రైవేట్‌లో అన్ని లైట్ మోటర్ వెహికల్ శిక్షణనే ఇస్తున్నారు. అందుకే సిరిసిల్లకు వచ్చి టీఐడీఈఎస్‌లో చేరా. సిమ్యులేటర్‌పై శిక్షణ ఇచ్చిన తర్వాత హెవీమోటర్ వెహికల్‌పై శిక్షణ ఇచ్చారు. ఇనిస్టిట్యూట్‌లోని ట్రాక్‌లపై హెవీ వెహికల్ శిక్షణ ఇచ్చారు. తర్వాత బయటి రోడ్లపైకి పంపుతారు. కళాశాల మాదిరిగా ప్రిన్సిపాల్, లెక్చరర్లు ట్రాఫిక్ రూల్స్, రోడ్డు ప్రమాదాలను ఎలా నివారించాలో అవగాహన కల్పిస్తున్నారు. కేటీఆర్ చొరవతో హెవీ మోటర్ డ్రైవింగ్ నేర్చుకోవాలన్న నా కోరిక నెరవేరుతున్నందుకు సంతోషంగా ఉంది.

**- నులిగొండ అంజయ్య, జగిత్యాల**

### సద్వినియోగం చేసుకోవాలి



మా టీఐడీఈఎస్ సంస్థ ద్వారా నిరుద్యోగులకు డ్రైవింగ్‌లో నైపుణ్య శిక్షణ ఇస్తున్నాం. ఇప్పటి వరకు 5 వేల మందికి శిక్షణ ఇచ్చాం. అందులో 300 మంది ప్రభుత్వ, ప్రైవేట్ కంపెనీల్లో ఉద్యోగాలు సాధించారు. అభ్యర్థులకు శిక్షణ ఇవ్వడంతోపాటు ముఖ్యంగా రోడ్డు ప్రమాదాలను నివారించేందుకు పూర్తిస్థాయిలో అవగాహన కల్పిస్తున్నాం. సుశిక్షితులైన డ్రైవర్లను తయారు చేయడమే లక్ష్యంగా ముందుకు పోతున్నాం. ప్రస్తుతం ఆర్టీసీలో మూడువేల డ్రైవర్ పోస్టులకు నోటిఫికేషన్ రాబోతున్నది. ఇక్కడ సర్టిఫికెట్ పొందిన వారికి ప్రభుత్వ, ప్రైవేట్ సంస్థల్లో తొలి ప్రాధాన్యత ఉంటుంది. ఈ అవకాశాన్ని నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలి.

**- దురై మురుగన్,**
**సెక్రటరీ ప్రిన్సిపల్**

## ప్రజల గొంతుక బీఆర్ఎస్

- తెలంగాణకు గులాబీ పార్టీనే శ్రీరామరక్ష
- అధికారం ఉన్నా లేకున్నా.. ప్రజల పక్షాన పోరాటం చేస్తాం
- హామీలు అమలు చేసేదాకా ఉద్యమిస్తాం
- జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత



మాట్లాడుతున్న జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత

జగిత్యాల, మార్చి 28: ప్రజల గొంతుక బీఆర్ఎస్ అని, అధికారం ఉన్నా.. లేకున్నా.. ప్రజల పక్షాన పోరాటం చేస్తామని జగిత్యాల జడ్పీ మాజీ చైర్‌పర్సన్ దావ వసంత సురేశ్ స్పష్టం చేశారు. తెలంగాణకు గులాబీ పార్టీనే శ్రీరామ రక్ష అని చెప్పారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలు అమలు చేసేదాకా ఉద్యమిస్తామని తేల్చి చెప్పారు. బీఆర్ఎస్ నుంచి కాంగ్రెస్‌లోకి మారిన ఎమ్మెల్యే అసెంబ్లీలో ఎక్కడా కనిపించడం లేదని.. ఆయన మాట కూడా ఎక్కడ వినిపించడం లేదని ఎద్దేవా చేశారు. ఇటీవల దేశంలో అత్యుత్తమ ముఖ్యమంత్రి ఎవరిని ఏఐ చాట్‌బాట్ గ్రోక్‌ని అడిగితే కేసీఆర్ పేరును చెబుతున్నదని హర్షం వ్యక్తం చేశారు. జగిత్యాల జిల్లా కేంద్రంలోని బీఆర్ఎస్ కార్యాలయంలో శుక్రవారం సీనియర్ నాయకులతో కలిసి ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడారు. అసెంబ్లీ సమావేశాల్లో మాజీ మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు, మండలిలో ఎమ్మెల్సీ కవిత ప్రజల పక్షాన సభలో ప్రభుత్వాన్ని నిలదీశారన్నారు. ఇచ్చిన హామీల అమలు చేయాలని వినూత్న రీతిలో నిరసనలు తెలిపారన్నారు. పెండింగ్ ఫీజురీయింబర్స్‌మెంట్ విషయంలో కూడా ప్రశ్నించిన విషయాన్ని గుర్తు చేశారు. బీర్‌పూర్ మండలంలోని రోళ్లవాగు ప్రాజెక్టుకు షటర్లు బిగించాలని, కొండగట్టు అంజన్న ఆలయాభివృద్ధికి నిధులు కేటాయించాలని మండలిలో ఎమ్మెల్సీలు కవిత, ఎల్ రమణ కోరారని తెలిపారు. నీళ్లు లేక ఎండిన, అకాల వర్షాల దెబ్బతిన్న పంటలకు నష్టపరిహారం అందించి రైతులను ఆదుకోవాలని, పసుపు, మిర్చి పంటలకు మద్దతు ధర కల్పించాలని డిమాండ్ చేశారు. సమావేశంలో పార్టీ పట్టణాధ్యక్షుడు గట్టు సతీశ్, ప్రధాన కార్యదర్శి అల్లాల ఆనందరావు, ఉపాధ్యక్షుడు వొళ్లెం మల్లేశం, రైతు సమన్వయ సమితి బాధ్యులు అల్లాల దామోదర్ రావు, వెంకటేశ్వర్‌రావు, నాయకులు రిజ్వాన్, గంగిపెల్లి వేణు, గాజుల శ్రీనివాస్, గంగిపెల్లి శేఖర్, కోటగిరి మోహన్, అజుమ్ భాయ్ పాల్గొన్నారు.

## సీఎంఆర్ ధాన్యం స్వాహా!



గంగాపురిలోని సత్యసాయి రైస్‌మిల్లులో ధాన్యం నిల్వలను పరిశీలిస్తున్న ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు

- శ్రీలక్ష్మి మోడ్రన్ రైస్‌మిల్లులో లెక్కల్లో తేడాలు
- సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ దాడుల్లో బహిర్గతం
- 41,365.27 క్వింటాళ్ల ధాన్యానికి 9,689.8 క్వింటాళ్లే లెక్క
- 31,675.47 క్వింటాళ్లు తక్కువ ఉన్నట్టు నిర్ధారణ

మంథని, మార్చి 28: సీఎంఆర్ ధాన్యాన్ని కొంతమంది రైస్ మిల్లర్లు అందినకాడికి బుక్కేస్తున్నారు. కేవలం పత్రాల్లోనే లెక్కలు చూపుతూ అందినకాడికి దోచుకుంటున్నారు. శుక్రవారం మంథని మండలం సూరయ్యపల్లిలోని శ్రీలక్ష్మి మోడ్రన్ పారాబాయిల్డ్ రైస్ అండ్ మిల్లులో జరిగిన తనిఖీల్లో సీఎంఆర్‌కు సంబంధించిన 31,675.47 క్వింటాళ్ల ధాన్యం స్వాహా అయినట్టు బట్టబయలైంది. తెలంగాణ సివిల్ సప్లై కమిషన్ ఆదేశాల మేరకు సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులు, ఎఫ్‌సీఐ అధికారులు ఏకకాలంలో తనిఖీలు చేపట్టారు. 2022-23 సంవత్సరానికి సంబంధించిన సివిల్ సప్లైకి చెందిన ధాన్యం నిల్వలు,2023-24 సంవత్సరానికి సంబంధించి ఎఫ్‌సీఐకి చెందిన ధాన్యం, బియ్యం నిల్వలపై తనిఖీ చేశారు. సూరయ్యపల్లిలోని శ్రీలక్ష్మి మోడ్రన్ పారాబాయిల్డ్ రైస్ అండ్ మిల్లులో పరిశీలించారు. తర్వాత అదే రైస్ మిల్లుకు సంబంధించి స్టాక్ నిల్వచేసిన గంగాపురిలోని సత్యసాయి రైస్‌మిల్లును తనిఖీ చేశారు. ఇక్కడ సీఎంఆర్ 41,365.27 క్వింటాళ్ల ధాన్యానికి 9,689.8 క్వింటాళ్లు మాత్రమే లెక్కలోకి రాగా, మిగతా 31,675.47 క్వింటాళ్ల ధాన్యం స్వాహా అయినట్టు గుర్తించారు. అదేవిధంగా ఎఫ్‌సీఐకి సంబంధించి 2023-24 రబీ సీజన్‌కు చెందిన 19,339 క్వింటాళ్ల మొత్తం ధాన్యం, బియ్యం నిల్వ ఉన్నట్టు పెద్దపల్లి గోదాం మేనేజర్ వెంకటేశ్ సాగర్ వెల్లడించారు. కానీ, బ్యాగ్‌లు మాత్రం వేరుగా ఉన్నట్టు తాము గుర్తించామని, ఈ విషయాన్ని ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తామని సివిల్ సప్లై టాస్క్‌ఫోర్స్ ఓఎస్‌డీ ప్రభాకర్, స్పెషల్ ఆఫీసర్ లక్ష్మారెడ్డి తెలిపారు. తనిఖీల్లో ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్ఐ జంగయ్య, సివిల్ సప్లై పెద్దపల్లి డీటీ సంతోష్ సింగ్,సివిల్‌సప్లై ఇన్‌స్పెక్టర్ శ్రీనివాస్ పాల్గొన్నారు.

### అధికారులతో వాగ్వాదం

హైదరాబాద్ నుంచి వచ్చిన సివిల్ సప్లై ఎన్‌ఫోర్స్‌మెంట్ అధికారులతో శ్రీలక్ష్మి మోడ్రన్ పారాబాయిల్డ్ రైస్‌మిల్లు యజమాని సత్యనారాయణ కొన్ని సందర్భాల్లో వాగ్వాదానికి దిగాడు. గంగాపురిలోని సత్యసాయి రైస్‌లో నిల్వ ఉంచిన ధాన్యాన్ని పరిశీలించేందుకు వచ్చిన సమయంలో మొదట షటర్లకు సంబంధించిన తాళాలు లేవని సమాధానం ఇచ్చాడు. దీంతో అధికారులు ఆగ్రహం వ్యక్తం చేసి, రైస్‌మిల్లు సిబ్బందితో తాళాలను పగలగొట్టించారు. గోదాంకు సంబంధించిన లాస్ట్ షటర్‌ను పగలగొట్టించగా లోపలికి వెళ్లకుండా బస్తాలను పేర్చి ఉంచారు. దాంతో అధికారులు నిచ్చెన వేసుకొని బస్తాల పైకి ఎక్కి లెక్కపెట్టగా ధాన్యం తక్కువగా ఉన్నట్టు ధ్రువీకరించారు. దీంతో యజమాని సత్యనారాయణ తప్పుగా లెక్క పెడుతున్నారంటూ మరోసారి వాగ్వాదానికి దిగాడు. ఆగ్రహించిన అధికారులు గోదాంకు ముందు భాగంలో ఉన్న షటర్లను సైతం తెరిపించి చూడగా ధాన్యం బస్తాలు నిండుగా లేవు. మళ్లీ యజమాని సమక్షంలో అధికారులు ధాన్యం బస్తాలను లెక్కించి 9,689.8 క్వింటాళ్లు మాత్రమే ఉన్నట్టు నిర్ధారించారు. దీనిపై రైస్‌మిల్లు యజమాని సత్యనారాయణ మాట్లాడుతూ, తమ రైస్ మిల్లులో ఉన్న ధాన్యం నిల్వలకు 2024 డిసెంబర్ 31లోగా టెండర్ తీసుకున్న గుత్తేదారు ధాన్యాన్ని తీసుకెళ్లాలని హైకోర్టు ఉత్తర్వులు ఉన్నాయని, ధాన్యం ఇంకా తీసుకెళ్లక పోవడం వాళ్లదే తప్పని తెలిపాడు. రైస్‌మిల్లులో ఉన్న ధాన్యానికి తరుగైనా, తూకంలో తేడా ఉన్నా హైకోర్టు ఉత్తర్వుల మేరకు డబ్బులు చెల్లించడానికి తాను సిద్ధంగా ఉన్నట్టు తెలిపారు.

## భూపాలపల్లికి బస్సేది?

- మంథనిలో రెండుగంటలపాటు ప్రయాణికుల ఇక్కట్లు



భూపాలపల్లికి వెళ్లే బస్సు కిక్కిరిసిపోవడంతో బయట ఉన్న ప్రయాణికులు

మంథని, మార్చి 28: సరిపడా బస్సులు లేక ప్రయాణికులకు ఇక్కట్లు తప్పడంలేదు. గంటలపాటు నిరీక్షణ తప్పడం లేదు. శుక్రవారం సాయంత్రం 5.30గంటల నుంచి రాత్రి 7.30గంటల వరకు మంథని బస్టాండ్ నుంచి భూపాలపల్లికి బస్సు లేక వందలాది మంది ప్రయాణికులు ఇబ్బందులు పడాల్సి వచ్చింది. దాదాపు 2గంటలు వేచి చూసిన తర్వాత భూపాలపల్లి డిపోకు చెందిన బస్సు గోదావరిఖని నుంచి మంథని బస్టాండ్‌కు చేరుకున్నది. ప్రయాణికులంతా ఒక్కసారి ఎగబడి ఎక్కడంతో బస్సు ఓవర్‌లోడ్ అయింది. ఆ బస్సులో స్థలం లేకపోవడంతో ఇంకా దాదాపు 50మందికి పైగా ప్రయాణికులు మరో బస్సు కోసం వేచిచూశారు. సరిపడా బస్సులు లేకపోవడంతో ఇలాంటి ఇబ్బందులు ఎదురవుతున్నాయని ప్రయాణికులు మండిపడుతున్నారు.

## మొరాయించిన లారీ

- కూనారం రోడ్డులో రెండుగంటల పాటు భారీ ట్రాఫిక్‌జామ్
- ఇబ్బందుల్లో ప్రయాణికులు



పెద్దపల్లి-కూనారం రోడ్ ఫ్లైవర్ బ్రిడ్జివద్ద నిలిచిన వాహనాలు

పెద్దపల్లి టౌన్, మార్చి28: పెద్దపల్లి-కూనారం ప్రధాన రహదారిపై ఫ్లైఓవర్ బ్రిడ్జి నిర్మాణ పనులు రెండేండ్లయినా పూర్తి కాకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. శుక్రవారం రాత్రి 7గంటల ప్రాంతంలో కూనారం రోడ్డులో ఓ లారీ మొరాయించడంతో దాదాపు రెండు గంటల పాటు భారీ ట్రాఫిక్ జామ్ ఏర్పడింది. దీంతో ప్రజలు, వాహనదారులు తీవ్ర ఇబ్బందిపడ్డారు. ట్రాఫిక్ పోలీసులు ఘటనాస్థలానికి చేరుకుని ట్రాఫిక్ క్లియర్ చేశారు. ఆ వెంటనే రైల్వే గేట్ పడడంతో మరో అరగంట ప్రయాణికులు ఇబ్బందిపడ్డారు. ఇప్పటికైనా రైల్వే అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించి వెంటనే రైల్వే ఫ్లైవర్ బ్రిడ్జి పనులు పూర్తి చేయాలని ప్రయాణికులు కోరుతున్నారు.